


## • పట్నంలో పల్లె తనం

విశ్వనగరమైన హైదరాబాద్‌లో పల్లె గుర్తులు నగరవాసులను అలరిస్తున్నాయి. బేగంపేట పైవంతెనకు పల్లె ప్రజల జీవితాన్ని ఆవిష్కరిస్తూ తీర్చిదిద్దిన కళాకృతులు నగరవాసులకు పల్లె వాతావరణాన్ని గుర్తు చేస్తున్నాయి. రణగొణ ధ్వనుల మధ్య సాగే పట్నంవాసుల హడావుడి జీవితాలకు పల్లె జీవన చిత్రాలు కాస్త ఉపశమనం కలిగిస్తున్నాయి.

# నేడు ఉమ్మడి వరంగల్‌కు మంత్రి కేటీఆర్

- భూపాలపల్లి సమీకృత కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్ ప్రారంభోత్సవం
- పరకాలలోనూ నూతన భవనాలు..
- తొర్రూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మూడు చోట్ల భారీ బహిరంగ సభలు



భూపాలపల్లి జిల్లాకేంద్రంలో మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్న సమీకృత కలెక్టరేట్ భవనం

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ)/పరకాల/తొర్రూరు: ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి, బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. మొదట భూపాలపల్లిలో సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను ప్రారంభించనున్నారు. డబుల్ బెడ్రూం ఇండ్లతోపాటు గృహలక్ష్మి, దళితబంధు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారు. సుభాష్‌కాలనీ పక్కనే గల మినీ స్టేడియంలో భారీ బహిరంగసభలో పాల్గొంటారు. పరకాలలో మున్సిపాలిటీ, తహసీల్, ఆర్డీవో కార్యాలయ భవనాలను ప్రారంభిస్తారు. చలివాగుపై చెక్‌డ్యాం, ధోబీఘాట్, డిగ్రీ కళాశాల నూతన భవనం పనులకు శంకుస్థాపన చేస్తారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించనున్నారు. పట్టణంలోని పశువుల అంగడి ఆవరణలో బహిరంగ సభలో పాల్గొంటారు. అదేవిధంగా తొర్రూరులో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, నూతన మున్సిపల్ కార్యాలయ భవనం పనులకు శంకుస్థాపన చేయనున్నారు. తొర్రూరు పెద్ద చెరువు వద్ద మినీ ట్యాంక్‌బండ్, శుద్ధి చేసిన మంచినీటి సరఫరా పనులకు కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. పాలకేంద్రం సమీపంలో బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం జనగామ జిల్లా కొడకండ్లకు చేరుకొని మినీ టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

# మానవీయ స్పర్శ ఆసరా

- వృద్ధులకు ఆత్మగౌరవం
- దివ్యాంగులకు జీవనాధారం
- అభాగ్యులకు బతుకు భరోసా
- పింఛన్లకు అర్థం చెప్పిన తెలంగాణ
- 'సామాజిక భద్రత'లో దేశానికే దిక్సూచి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): సామాజిక బాధ్యతలను నిర్వర్తించడంలో తెలంగాణ ప్రభుత్వం తన ప్రత్యేకతను చాటుకుంటున్నది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత, బీడీ కార్మికులు ఇలా మొత్తం 11 క్యాటగిరీల వారికి సామాజిక భద్రతను కల్పిస్తూ మానవీయతను ప్రదర్శిస్తున్నది. వారికి ప్రతి నెలా పింఛన్లు అందజేస్తూ 'ఆసరా'గా నిలుస్తున్నది. 'మీకు మేమున్నాం' అన్న భరోసాను కల్పిస్తున్నది. లక్షలాది పేదలు, విధి వంచితులు ఆత్మగౌరవంతో జీవించేలా తోడ్పాటునందిస్తున్నది. కరోనా మహమ్మారి కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఆటుపోట్లు ఎదురైనా రాజధర్మాన్ని విస్మరించలేదు. అన్నార్తులను, అభాగ్యులను ఆదుకునే విషయంలో మరింత మానవీయతను ప్రదర్శించింది. ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచింది. 'పింఛన్ అంటే భిక్ష కాదు. ఈ సమాజ పురోగాభివృద్ధికి, దేశ సంపదల సృష్టికి జీవతమంతా వారు చేసిన శ్రమకు వినమ్రతతో అందిస్తున్న ప్రతిఫలం..' అన్న స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నది తెలంగాణ ప్రభుత్వం. అందుకే ఇవాళ రాష్ట్రంలో లక్షలాది వృద్ధులు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తమ పెద్ద కొడుకుగా భావించి అభిమానిస్తున్నారు.



తెలంగాణలో 11 వర్గాలకు పింఛన్లు

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు కేవలం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు అనే ఐదు క్యాటగిరీలకు మాత్రమే పింఛన్ అందిస్తున్నాయి. తెలంగాణ 11 క్యాటగిరీలకు పింఛన్లు వర్తింపజేస్తుండటం సీఎం కేసీఆర్ మానవీయ కోణానికి మరో నిదర్శనం. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఎయిడ్స్ బాధితులు, చేనేత కార్మికులతోపాటు ఒంటరి మహిళలు, బోధకాలు బాధితులు, డయాలసిస్ పేషంట్లు, గీత కార్మికులు, వృద్ధకళాకారులు, బీడీ కార్మికులకు సైతం పింఛన్ల పథకాన్ని వర్తింపజేస్తున్నది తెలంగాణ ప్రభుత్వం.

2004 నుంచి 2014 వరకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల కోసం తెలంగాణకు కేటాయించినది: రూ.5,558 కోట్లు

సీఎం కేసీఆర్ ప్రభుత్వం 2014-2023 మే వరకు పింఛన్ల కోసం కేటాయించినది: రూ.58,696.34 కోట్లు

| 2014లో తెలంగాణలో పింఛన్ లబ్ధిదారులు | ప్రస్తుతం తెలంగాణలో పింఛన్ లబ్ధిదారులు |
|---|---|
| 29 లక్షలు | 44.74 లక్షలు |

| స్వరాష్ట్రంలో కొత్తగా మంజూరైన పింఛన్లు | ఉమ్మడి రాష్ట్రంలో పింఛన్ల కోసం ఏటా పెట్టిన ఖర్చు |
|---|---|
| 15.33 లక్షలు | 809.64 లక్షలు |

తెలంగాణ ప్రభుత్వం ఏటా వెచ్చిస్తున్న మొత్తం రూ.11,717.04 కోట్లు

## ఆదాయ పరిమితి పెంపు

*ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌తో సహా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్ తదితర అనేక రాష్ట్రాలు పింఛన్ పథకానికి అర్హుల ఎంపికలో అనేక ఆంక్షలను విధిస్తున్నాయి. అందులో కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి ప్రధానమైనది. చాలా రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో రూ.60 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.75 వేల వార్షిక ఆదాయం మించితే వారికి పింఛన్ ఇవ్వడం లేదు. వయసు తదితర అంశాల్లో సవాలక్ష పరిమితులను విధించారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ప్రతి అంశంలోనూ ఉదారంగా వ్యవహరిస్తూ మానవీయతను చాటుకుంటున్నది. వీలైనంత ఎక్కువ మంది అభాగ్యులకు లబ్ధి చేకూర్చడమే పరమావధిగా పథకాలను అమలు చేస్తున్నది. పింఛన్లకు వార్షిక ఆదాయ పరిమితిని మరే రాష్ట్రంలోనే లేనివిధంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలుగా నిర్ణయించడం సీఎం కేసీఆర్ మానవీయతకు నిదర్శనం. వృద్ధుల పింఛన్ అర్హత వయస్సును 57 ఏండ్లకు కుదించడం మరో విశేషం. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాల ఫలితంగానే రాష్ట్ర ఏర్పాటు నాటికి కేవలం 29 లక్షలకు మించని పింఛన్‌దారుల సంఖ్య నేడు 44 లక్షలు దాటింది.*

### పలు పెద్ద రాష్ట్రాలు అందిస్తున్న పింఛన్లు (రూపాయల్లో)

| రాష్ట్రం | వృద్ధులు | వితంతువులు | దివ్యాంగులు |
|---|---|---|---|
| తెలంగాణ | 2,016 | 2,016 | 4,016 |
| ఆంధ్రప్రదేశ్ | 2,500 | 2,500 | 3,000 |
| పంజాబ్ | 1,500 | 1,500 | 1,500 |
| కేరళ | 1,400 | 1,400 | 1,400 |
| కర్ణాటక | 1,200 | 600-750 | 400-1000 |
| ఉత్తరప్రదేశ్ | 1,000 | 1,000 | 1,000 |
| పశ్చిమబెంగాల్ | 1,000 | 1,000 | 1,000 |
| తమిళనాడు | 1,000 | 1,000 | 1,000 |
| రాజస్థాన్ | 750-1,000 | 500-1,000 | 750-1,500 |
| గుజరాత్ | 750-1,000 | 1,250 | 750-1,000 |
| మధ్యప్రదేశ్ | 600-800 | 600 | 600 |
| మహారాష్ట్ర | 600 | 600-900 | 600-1,000 |
| ఒడిషా | 500-700 | 500 | 500 |
| బీహార్ | 400-500 | 300 | 400 |

### తెలంగాణలో పింఛన్ లబ్ధిదారులు

| పింఛన్ | అందించే మొత్తం | లబ్ధిదారుల సంఖ్య | తొమ్మిదేండ్లలో ఖర్చుచేసింది |
|---|---|---|---|
| దివ్యాంగులు | రూ.4,016 | 5,16,722 | రూ.10,247.19 కోట్లు |
| వృద్ధులు | రూ.2,016 | 16,38,089 | రూ.18,597.90 కోట్లు |
| వితంతువులు | రూ.2,016 | 15,84,063 | రూ.20,565.34 కోట్లు |
| ఒంటరి మహిళలు | రూ.2,016 | 1,43,894 | రూ.1546.00 కోట్లు |
| గీత కార్మికులు | రూ.2,016 | 67,034 | రూ.882.34 కోట్లు |
| చేనేత కార్మికులు | రూ.2,016 | 38,219 | రూ.520.53 కోట్లు |
| ఎయిడ్స్ బాధితులు | రూ.2,016 | 37,645 | రూ.448.08 కోట్లు |
| బీడీ కార్మికులు | రూ.2,016 | 4,25,726 | రూ.5719.97 కోట్లు |
| బోధకాలు బాధితులు | రూ.2,016 | 18,633 | రూ.161.84 కోట్లు |
| డయాలసిస్ పేషంట్లు | రూ.2,016 | 4,657 | రూ.7.09 కోట్లు |
| వృద్ధ కళాకారులు | రూ.3,016 | 1,967 | రూ.49.30 కోట్లు |

## పలు పెద్ద రాష్ట్రాల్లో పింఛన్ల అమలు ఇలా..

**మధ్యప్రదేశ్**

- వృద్ధాప్య పింఛన్ అర్హత వయస్సు 60 ఏండ్లు.
- ఇచ్చే మొత్తం 60-79 ఏండ్లు ఉంటే నెలకు 300. 80 ఏండ్లు పైబడిన వారికి రూ.500. రాష్ట్రం అదనంగా ఇచ్చే మొత్తం రూ.300.
- వితంతువుల పింఛన్ అర్హత వయస్సు 18-79 నుంచి ఏండ్లు. అందించే మొత్తం రూ.300. రాష్ట్రం అదనంగా ఇచ్చే మొత్తం రూ.300. వయో పరిమితి 18-39 ఏండ్లు.
- దివ్యాంగుల పింఛన్‌కు కేంద్రం వాటా రూ.300. అదీ 18-79 ఏండ్లు ఉండి, 80 శాతం వైకల్యముంటేనే. అదనంగా రాష్ట్రం ఇచ్చేంది రూ.300. అది కూడా 6-18 ఏండ్ల దివ్యాంగులకు మాత్రమే.

**గుజరాత్**

- వృద్ధాప్య పింఛన్ అర్హత వయస్సు 60 ఏండ్లు.
- ఇచ్చే మొత్తం రూ.750. 80 ఏండ్లు పైబడిన వారికి రూ.1000.
- వితంతువుల పింఛన్ అర్హత వయస్సు 18-40 ఏండ్లు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు మించకూడదు. అందించే మొత్తం రూ.1,250.
- దివ్యాంగుల పింఛన్ అర్హత 18-79 ఏండ్లు. వైకల్యం 50 శాతం మించి ఉండాలి. అందించే మొత్తం రూ.1000.

**ఉత్తరప్రదేశ్**

- వృద్ధాప్య పింఛన్ అర్హత వయసు 60 ఏండ్లు.
- ఇచ్చే మొత్తం నెలకు రూ.1000. అదీ మూడు నెలలకు ఒకసారి ఇస్తారు.
- గ్రామీణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.46,080, పట్టణప్రాంతాల వార్షిక ఆదాయం రూ.56,460 మించకూడదు.
- వితంతువుల పింఛన్ అర్హత వయస్సు 18 ఏండ్లు దాటాలి. అందించే మొత్తం రూ.1000
- దివ్యాంగుల పింఛన్ అర్హత 18 ఏండ్లు దాటాలి. గ్రామీణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.46,080, పట్టణప్రాంతాల వార్షిక ఆదాయం రూ.56,460 మించకూడదు. వైకల్యం 40 శాతం మించి ఉండాలి. అందించే మొత్తం రూ.1000.

**రాజస్థాన్**

- వృద్ధాప్య పింఛన్ అర్హత వయస్సు 65 ఏండ్లు. ఇచ్చే మొత్తం రూ.750. 75 ఏండ్లు పైబడిన వారికి రూ.1000.
- వితంతువుల పింఛన్ అర్హత వయసు 18. అందించే మొత్తం రూ.500. 55-60 ఏండ్లు దాటినవారికి 750. 60-75 ఏండ్లవారికి 1000.
- దివ్యాంగుల పింఛన్ అర్హత 18 ఏండ్లు. వైకల్యం 40 శాతం ఉండాలి. 55 ఏండ్ల లోపు వారికి రూ.750. 55-75 వరకు రూ.1000. 75 ఏండ్లు పైబడిన వారికి రూ.1250. కుష్ఠు వ్యాధిగ్రస్థులకు రూ.1500.
- (వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.48,000, పట్టణ ప్రాంతాల్లో రూ.60,000 మించకూడదు. అన్ని పింఛన్లకు)

**తెలంగాణ**

- వృద్ధాప్య పింఛన్ అర్హత కనీస వయస్సు 57 ఏండ్లు. ఇచ్చే మొత్తం రూ.2,016.
- వితంతువుల పింఛన్ అర్హత వయసు 18-57 ఏండ్లు. అందించే మొత్తం రూ.2,016.
- దివ్యాంగుల పింఛన్ అర్హత కనీస వయసు 5 ఏండ్లు. వైకల్యశాతం 40 శాతం. అందించే మొత్తం రూ.3,016.
- అన్నింటికీ మించి గ్రామీణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించకూడదు.

# కర్ణాటకలో కాంగ్రెస్ హ్యాండ్సప్!

మొదటిపేజీ తరువాయి...

రోజుల క్రితం కాంగ్రెస్ ఎమ్మెల్యే కే శడాక్షరి పబ్లిక్‌గానే ఆవేదన వ్యక్తంచేశారు. తాజాగా సీఎం సిద్ధరామయ్యనే మహిళలు గృహలక్ష్మి పథకం కోసం నిలదీయటంతో ఈ పథకాల అమలులో కాంగ్రెస్ చేతులెత్తేసినట్టు తేలిపోయింది.

**నెలకు రూ.1600 ఆదాయం దాటితే పెన్షన్ కట్**

పథకాలు అమలుచేయలేక కర్ణాటక ప్రభుత్వం అడ్డదిడ్డమైన షరతులతో వాటిని నీరుగారుస్తున్నది. పెన్షన్ పథకమే అందుకు ఉదాహరణగా నిలుస్తున్నది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు అందిస్తున్నది. అదికూడా ఈ మూడు వర్గాలకు మూడు రకాలుగా ఇస్తున్నది. నిబంధనలు కూడా వేర్వేరుగా పెట్టింది. ఈ పథకం ద్వారా వృద్ధులకు ఇస్తున్నదే రూ.600 కాగా, అది పొందటానికి కూడా విస్మయపరిచే కండిషన్ పెట్టింది. ఏడాదికి రూ.20 వేలకంటే ఎక్కువ సంపాదన ఉన్నవారు పెన్షన్‌కు అర్హులు కాదని ప్రకటించింది. అంటే నెలకు రూ.1666 కంటే ఎక్కువ ఆదాయం ఉంటే పెన్షన్‌కు అర్హత ఉండదు. ఈ మొత్తంతో ఒక వ్యక్తి నెలకు సరిపడా బియ్యం కూడా కొనుక్కోలేడు. అలాంటప్పుడు అంత తక్కువ ఆదాయంతో అసలు మనుషులు బతకగలరా? అని సామాజికవేత్తలు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. అంత తక్కువ ఆదాయం ఉన్న వారు ఎవరూ ఉండరని తెలిసే కర్ణాటక ప్రభుత్వం ఈ నిబంధన విధించిందని చెప్తున్నారు. అంతేకాకుండా వ్యక్తి బ్యాంకు అకౌంట్‌లో రూ.10,000 మించి డబ్బు ఉన్నా ఈ పథకానికి అనర్హులే. చాలా బ్యాంకులు అకౌంట్ ఓపెన్ చేయాలంటే మినిమమ్ (తప్పనిసరిగా ఉంచాల్సిన డబ్బు) బ్యాలెన్సే రూ.5000 ఉండాలని కండిషన్ పెడుతున్నాయి. అలాంటప్పుడు ఈ కండిషన్ పెట్టడంలో ఏమైనా ఔచిత్యం ఉన్నదా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ పథకం కింద వృద్ధుల్లోనే ఏకమొత్తంగా కాకుండా లబ్ధిదారులను మూడు వర్గాలుగా విభజించి పెన్షన్ ఇస్తున్నారు. అదికూడా ప్రాథమిక అర్హత 60 ఏండ్లు దాటితేనే. తెలంగాణలో ఆసరా పెన్షన్ 57 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరికి ఒకేలా ఇస్తున్నారు. కర్ణాటకలో మాత్రం 60-64 ఏండ్ల మధ్య ఉన్నవారికి రూ.600, 65-80 ఏండ్ల మధ్యవారికి రూ.1000, 80 ఏండ్లు దాటినవారికి రూ.1200 ఇస్తున్నారు. 80 ఏండ్లు దాటినవారు చాలా తక్కువ మంది ఉంటారు. మొదటి శ్లాబులోనే అధికంగా ఉంటారు. అది తెలిసే కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ అతి తక్కువగా రూ.600 పెట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

*రాష్ట్రంలో వచ్చే రెవెన్యూ మొత్తం ఐదు గ్యారెంటీలకే సరిపోవటం లేదు. ఇతర పథకాలు, కార్యక్రమాలకు ఇప్పుడు నిధులు ఇచ్చే పరిస్థితి లేదు. ఐదు హామీలు మనల్ని ఇతర అభివృద్ధి పనులు చేయకుండా పడుకోబెట్టాయి.*

**-కే షడాక్షరి, కర్ణాటకలోని తిప్తూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే.**

## కర్ణాటకలో పెన్షన్ల అమలు తీరు..

**వృద్ధాప్య పెన్షన్ అర్హతలు**

- **కనీస వయసు:** 60 ఏండ్లు
- **వార్షికాదాయం:** కుటుంబం మొత్తం ఆదాయం రూ.20 వేలకు మించకూడదు. బ్యాంకులో రూ.10 వేలకు మించి డిపాజిట్ ఉండకూడదు.
- **అర్థిక సాయం అందించే విధానం:** 60-64 ఏండ్ల వారికి నెలకు రూ.600. 65- 80 ఏండ్ల వారికి రూ.1,000. 80 ఏండ్లు పైబడిన వారికి రూ.1,200

**వితంతు పెన్షన్ అర్హతలు**

- **వయస్సు:** 18-65 ఏండ్లు
- **వార్షికాదాయం:** రూ.1.2 లక్షలు మించకూడదు
- **అర్థిక సాయం అందించే విధానం:** పిల్లలు లేని వితంతువులకు నెలకు రూ.600, పిల్లలుంటే రూ.800

**దివ్యాంగుల పెన్షన్ అర్హతలు**

- **వయస్సు:** అన్ని వయస్సులు
- **వార్షికాదాయం:** గ్రామీణ ప్రాంతాల్లో వార్షికాదాయం రూ.1.2 వేలు మించకూడదు.
- **అర్థిక సాయం అందించే విధానం:** 40 శాతం వైకల్యముంటే నెలకు రూ.800, 75 శాతానికి మించి వైకల్యముంటే రూ.1,600

**43 శాతం దివ్యాంగులకే పెన్షన్**

దివ్యాంగులను కూడా కర్ణాటక ప్రభుత్వం దొంగదెబ్బ తీసింది. ఈ పథకానికి అర్హులు కావాలంటే వార్షికాదాయం రూ.1.2 లక్షలకంటే తక్కువ ఉండాలి. అదీకాక వైకల్యం తీవ్రతనుబట్టి పెన్షన్ నిర్ణయించారు. 40-74 శాతం వైకల్యమున్న వారికి రూ.800, 75 శాతానికి మించి వైకల్యమున్న వారికి రూ.1600 మాత్రమే పెన్షన్ అందిస్తున్నది. తెలంగాణలో ఎలాంటి వైకల్యమున్నా అందరికీ సమానంగా రూ.4,016 పెన్షన్ ఇస్తున్నది. కర్ణాటకలో 13.24 లక్షల మంది గుర్తింపు పొందిన దివ్యాంగులున్నారు. ప్రభుత్వం విధించిన గరిష్ఠ వార్షికాదాయ నిబంధన వల్ల ఈ పథకానికి 5.75 లక్షల (43.4%) మంది మాత్రమే అర్హత పొందారు. ఇలా లక్షలమంది అర్హతగలవారిని పథకాలకు దూరం చేస్తూ ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## టీ-హబ్‌ను సందర్శించిన 'స్టేట్ స్ట్రీట్' బృందం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా టీ-హబ్ వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నది. హైదరాబాద్‌తోపాటు దేశ, విదేశాల్లో ఉన్న కార్పొరేట్ సంస్థలతో కలిసి పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని స్టేట్‌స్ట్రీట్ కంపెనీ ప్రతినిధుల బృందం ఆదివారం టీ-హబ్‌ను సందర్శించింది. కార్పొరేట్ సంస్థలతో కలిసి పనిచేస్తూ వివిధ రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలు సృష్టించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని టీ-హబ్ నిర్వాహకులు తెలిపారు. స్టేట్‌స్ట్రీట్ కంపెనీ ప్రతినిధుల బృందం టీ హబ్‌లోని స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను పరిశీలించి, పలు అంశాలపై చర్చించిందని, ఇక్కడి స్టార్టప్‌లతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపిందని పేర్కొన్నారు.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 38.2°c | 24.4°c |
| మెదక్ | 37.4°c | 18.8°c |
| ఆదిలాబాద్ | 37.1°c | 21.0°c |
| రంగారెడ్డి | 37.4°c | 16.8°c |
| ఖమ్మం | 34.0°c | 23.0°c |
| కరీంనగర్ | 34.0°c | 23.0°c |
| వరంగల్ | 34.0°c | 22.0°c |
| హైదరాబాద్ | 33.6°c | 20.7°c |
| నిజామాబాద్ | 33.2°c | 23.4°c |
| మహబూబ్‌నగర్ | 32.8°c | 23.5°c |

## నిపుణ విద్య, ఉద్యోగ సమాచారం

### పారామెడికల్ స్టాఫ్

**న్యూఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీతోపాటు మరో మూడు హాస్పిటల్స్ (కాలేజీ)ల్లో పారామెడికల్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 909
- పోస్టులు: పారామెడికల్ స్టాఫ్ (ఫ్యామిలీ వెల్ఫేర్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేటర్, రేడియోగ్రాఫర్, ఎక్స్‌రే అసిస్టెంట్, ఎక్స్‌రే టెక్నీషియన్, డెంటల్ మెకానిక్, కేర్ టేకర్, రిసెప్షనిస్ట్, సైకాలజిస్ట్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 25
- వెబ్‌సైట్: hhttp://www.vmmc-sjh.nic.in

### సీపీసీఆర్ఐలో..

**సెంట్రల్ పల్ప్ & పేపర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 26
- పోస్టులు: సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్స్, టెక్నీషియన్ గ్రూప్ (2,3)
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 30
- వెబ్‌సైట్: www.cppri.res.in

### సీసీఎంబీలో...

**హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 2
- పోస్టులు: సెక్యూరిటీ ఆఫీసర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 31
- వెబ్‌సైట్: www.ccmb.res.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- డీఎస్సీ ప్రత్యేకం బయాలజీ, ఐఐటీ,నీట్ స్పెషల్ ఫిజిక్స్, గ్రూప్స్ ప్రత్యేకం పాలిటీ కోసం పైన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.